## క్లుప్తంగా

### పచ్చాలమ్మకు పొంగళ్లు


అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

బుచ్చినాయుడు కండ్రిగ: పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మ దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

### వర్షంతో దెబ్బతిన్న వరి పంట


కనమనంబేడులో నీట మునిగిన వరిపంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం కురిసిన భారీ వర్షంతో వరి పంట దెబ్బతింది. నీర్పాకోట, కాంపాళ్లెం, కుక్కంబాకం, కనమనంబేడు గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లోని వరి పంట నీట మునిగింది. కోత దశకు చేరుకున్న పంట నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### గ్రావెల్ ఏర్పాటు


రోడ్డుపై గ్రావెల్ చదును చేస్తున్న కూలీలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో మట్టి రోడ్డుకు ఆదివారం సర్పంచ్ పాతగుంట మంజుల ఆధ్వర్యంలో గ్రావెల్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి రోడ్డుపై మురుగునీరు చేరింది. గ్రామస్తుల వినతిపై ఆమె స్పందించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పాతగుంట గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నం రెడ్డి, కోదండరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మోదీ జన్మదిన వేడుకలు


వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

సత్యవేడు: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను సత్యవేడులో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జి.మునిప్రతాప్, పార్టీ నాయకులు వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి వాసు పాల్గొన్నారు.

### ప్రెస్‌క్లబ్ ఎన్నిక


ఎన్నికైన కొత్త కార్యవర్గం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కామేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా వీసీ వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరబాబు, మునికృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా మెహర్, బత్తెయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా రవిరెడ్డి, కోశాధికారిగా మునిమోహన్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంవీ రమణ శ్రీరాములు, ఈశ్వరయ్య, వెంకటేష్, రవి, రామచంద్ర, శ్రీనివాసులు, రమేష్, హరీష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన కూచిపూడి నృత్యం

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం అలరించింది. మదనపల్లికి చెందిన శ్రీ సూర్య డ్యాన్స్ అకాడమీ, నాట్య గురువు సూర్య ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ ఆకట్టుకుంది. కళాకారులు లిపికశ్రీ, వైష్ణవి, పల్లవి, భవ్యశ్రీ, ప్రజ్ఞ, ప్రణతి, యాశ్విత, హర్షిత, హిమాని, శ్రావణిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు.

### ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


గురవయ్య (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని మోదుగులపాలెం పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కురుం గురవయ్య(54) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతిపై డ్వామా పీడీ శ్రీనివాసరావు, ఏపీడీ సరిత, ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు సంతాపం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు


పిచ్చాటూరు ఎస్టీ కాలనీలో మహిళకు సంక్షేమ బావుటా అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రం పిచ్చాటూరు హరిజనవాడ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభమై టీచర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ, ఆదిఆంధ్రవాడలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలు అందించిన జగనన్నను 2024లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎస్టీ కాలనీకి శ్మశానం కావాలని ప్రజలు ఎమ్మెల్యేకి విన్నవించారు. టీచర్స్ కాలనీలో డ్రైనేజి నిర్మించాలని, అలాగే పలువురు ఇంటి పట్టాలు, కొత్త పింఛన్‌లు కావాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా, పింఛను మంజూరు చేయాలని అక్కడే ఉన్న తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసులుకు సూచించారు. మురుగు కాలువల నిర్మాణానికి గడపగడప కార్యక్రమం నిధులు రూ.20 లక్షలతో పూర్తి చేస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.

**తప్పు చేశారు గనుకే బాబు జైలుకు..**

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్కిల్ స్కామ్‌లో తప్పు చేశారు గనుకే న్యాయస్థానం జైలుకు పంపిందని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు జీవితం మొత్తం వెన్నుపోటు, కుట్ర రాజకీయాలతోనే గడిచిందన్నారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడవడం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీడియో, ఆడియో ఆధారాలతో అడ్డంగా దొరికినా వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకున్నారని మండిపడ్డారు. అయితే పక్కా ఆధారాలతో సీఐడీ అధికారులు స్కిల్ డెవలప్‌మెంట్ కేసును కోర్టు ముందు ఉంచారన్నారు. కేసును పరిశీలించిన న్యాయస్థానం చంద్రబాబుకు రిమాండ్ విధించిందన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో పెయిడ్ ఆర్టిస్టుల చేత నిరసన తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, శోభన్, బేబి, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్, అన్నాదురై, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశులు, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, మోహన్ రెడ్డి, పాల పద్మనాభం, చలపతిరాజు, తొప్పయ్య, శేఖర్ రెడ్డి, మోహన్, తొప్పయ్య, చెంగ్రాయ రెడ్డి, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

శ్రీకాళహస్తి: మండలంలోని ఊరందూరులో వెలసిన శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సహకారంతో రూ.40లక్షలతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు, ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అధికారులు, గ్రామపెద్దలు నీలకంఠారెడ్డి, చంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, సుబ్బరామయ్య, రఘురామయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

# పురాతన ఆలయాలకు మహర్దశ


పూజాద్రవ్యాలను అందజేస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఆలయాలకు మహర్దశ పట్టనుంది. అందులో భాగంగా ఆదివారం అనుబంధ ఆలయాలైన వేయి లింగాలకోనలో వెలసిన మార్కండేయ ఆలయం, పట్టణంలోని దుర్గమ్మ ఆలయం వద్ద ఉన్న దుర్గామల్లీశ్వరస్వామి ఆలయం, పట్టణంలోని ఈటీసీ కేంద్రం వద్ద ఉన్న కాశీవిశ్వరస్వామి ఆలయం, కై లాసగిరి కొండలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా బాలాలయ స్థాపన పూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు కలశ స్థాపన చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా బాలాలయ స్థాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ పురాతన ఆలయాలకు మహర్దశ పట్టే విధంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, దక్షిణామూర్తి, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు తదితరులు పాల్గొన్నారు.

# చవితి వేడుకలకు ముస్తాబు


చవితి వేడుకలకు ముస్తాబైన పెండ్లి మండపం


పట్టణంలో ట్రాఫిక్ జామ్


బేరివారి మండపం


స్వర్ణముఖి వంతెన వద్ద పూజాసామగ్రి కొంటున్న ప్రజలు

శ్రీకాళహస్తి: దక్షిణ కైలాస క్షేత్రమైన శ్రీకాళహస్తి చవితి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వాడవాడల్లో గణనాథుని విగ్రహాలు ప్రతిష్ఠించి చవితి వేడుకలు అంబరాన్ని అంటే విధంగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గణపతి మండపాలను నిర్వాహకులు విద్యుత్ దీపకాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మండపాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. శ్రీకాళహస్తి హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద ఉన్న గణపతి ప్రతిమల విక్రయశాల నుంచి పెద్దఎత్తున విగ్రహాలను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఇప్పటికే గణనాథున్ని నిలిపే ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలతో పాటు డీజే సౌండ్, మైక్ సెట్‌లను ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో అనేక చోట్ల విద్యుత్‌కాంతుల శోభతో గణనాథుని మండపాలు ఆలయాలు సర్వాంగ సుందరంగా నేత్రపర్వంగా మారాయి. స్థానిక పెళ్లి మండపం, బేరివారి మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గాంధీ వీధిలోని జ్ఞానసిద్ధి వినాయకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కుమారస్వామి తిప్ప, శివం సర్కిల్, కూరగాయల మార్కెట్, పాత బస్టాండు, వెంకటగిరి బస్టాండు వద్ద పూజాసామగ్రి, కూరగాయల కోసం చుట్టుపక్కల జనం తరలివచ్చారు. దీంతో పట్టణం జన సందోహంగా మారింది.

### పింఛన్ ఇచ్చి ఆదుకోండి


బాధిత బాలుని చూపిస్తున్న తండ్రి

కేవీబీపురం: హిమోఫీయ వ్యాధితో చిన్నతనం నుంచి బాధపడుతున్న తన కుమారునికి పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఓ తండ్రి ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు. దిగువపుత్తూరు గ్రామానికి చెందిన కుప్పయ్య కుమారుడు సంతోష్(14) స్థానికంగా పదవ తరగతి చదువుతున్నాడు. సంతోష్ చిన్నతనం నుంచే హిమోఫియా వ్యాధికి గురై అనారోగ్యంతో బాధపడుతున్నాడని తల్లి లేకపోవడంతో తన కష్టంమీదనే కుమారుడికి వైద్యం చేయిస్తూ మందులు కొనుగోలు చేస్తున్నానని తండ్రి తెలిపాడు. కుమారునికి పింఛన్ ఇస్తే వైద్య ఖర్చులకు సహకారం అందుతుందనే ఆలోచనతో ఇప్పటికే ఏడుమార్లు పింఛన్‌కు దరఖాస్తుచేశామని కానీ రాలేదని ఎందుకు రాలేదన్న కారణాలను సచివాలయ సిబ్బంది తెలపడంలేదని వాపోయాడు. ఇప్పటికైనా తన కుమారునికి పింఛన్ అందించి ఆదుకోవాలని బాలుని తండ్రి మొరపెట్టుకుంటున్నాడు.

### స్కిల్ స్కామ్‌పై సిగ్గుపడాలి

కేవీబీపురం: అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ చంద్రబాబునాయుడు చేసిన స్కిల్ స్కామ్ పట్ల బాధ్యత వహిస్తూ టీడీపీ నేతలు సిగ్గుపడాలని జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి లోకనాథరెడ్డి అన్నారు. ఆదివారం బాబు అరెస్టును సమర్థిస్తూ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కింద నిరుద్యోగులకు, విద్యార్థులకు, నిరుపేద తరగతి వారికి శిక్షణ కల్పించి ఉపాధిని అందించాల్సిన చంద్రబాబు ఆ నిధులను స్వార్థానికి దోపిడీ చేయడంతో పాటు అధికార దుర్వినియోగానికి పాల్పడడం రాజకీయ చరిత్రలో చెరగని ముద్రగా మారిందని ఆయన పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో షెల్ కంపెనీల ద్వారా రూ.371కోట్లను దారి మళ్లించి అడ్డగోలుగా దోచుకోవడంతో కోర్టు చంద్రబాబుకు శిక్ష వేసిందన్నారు. ఇది ఏమీ పట్టని టీడీపీ నేతలు ఆ పార్టీ నేతల మెహర్బానీ కోసం నీరసించిన నిరసనలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ


మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న యువనేస్తం సభ్యులు


ఏర్పేడులో..

శ్రీకాళహస్తి: మండలంలోని రామాపురం, రామలింగాపురం, భైరవ ఎస్టీకాలనీల్లో వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం యువనేస్తం అసోసియేషన్ సభ్యులు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. అధ్యక్షుడు మునిశేఖర్, సభ్యులు వెంకటేష్, హేమలత, వినోద్, నాగమణి, వలంటీర్లు వెంకటేష్, హేమలత, స్రవంతి, శ్రావణి పాల్గొన్నారు.

**యువసమాజ్ నిర్మాణ్ ఆధ్వర్యంలో..**

ఏర్పేడు: యువసమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఏర్పేడు, నాగంపల్లి గోపాలపురం, పాతవీరాపురం, నాగంపల్లి, అముడూరు, మేర్లపాక తదితర గ్రామాల్లో 570 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాజేంద్ర, పవన్, శివ, మోహిత్ పాల్గొన్నారు.

**చవితి సందడి**

బుచ్చినాయుడుకండ్రిగ: వినాయక చవితి పండుగ సందర్భంగా కొనుగోలుదారులతో దుకాణాలు ఆదివారం కళకళలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జనంతో సందడి నెలకొంది. వస్త్ర, కిరాణా దుకాణాలు, పూజాసామగ్రి షాపులు కిటకిటలాడాయి.


విక్రయానికి సిద్ధం చేసిన పూలు, పండ్లు

### ● ఆకట్టుకున్న కోలాటం


స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కళాకారులు కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నారు. మహిళలు, పురుషులు, చిన్నపిల్లలు భజనలు చేసి భక్తిభావాన్ని చాటారు.

\- బుచ్చినాయుడుకండ్రిగ